కార్తిక వైభోగం

- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- శివ నామ స్మరణతో దద్దరిల్లిన ఆలయాలు
- కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్న భక్తులు

రాంకోఠిలోని సీతారామాంజనేయ స్వామి మందిరంలో నిర్వహించిన సామూహిక వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు, మంత్రోచ్చరణలు చేస్తున్న వేద పండితులు

సంగం రామాలయంలో రథం ఊరేగింపులో సంగం రామచంద్రజీ మఠం మఠాధిపతి రాహుల్ దాస్ బాబా

తులసీ చెట్టుకు పూజలు చేసి దీపాలు వెలిగించిన దృశ్యం

అంబర్‌పేట/మెహిదీపట్నం/సుల్తాన్‌బజార్/అబిడ్స్, నవంబర్ 15: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట డివిజన్లలో ఉన్న దేవాలయాలన్నీ తెల్లవారుజాము నుంచే భక్తులతో కిక్కిరిసి పోయాయి. ప్రధానంగా శివాలయాలు రద్దీగా కనిపించాయి. భక్తులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి కార్తిక దీపాలు వెలిగించారు. గోల్నాక డివిజన్‌లోని వీరన్న గుట్ట మహా శివాలయం ఆవరణలో తెల్లవారు జామునే ఆలయ కమిటీ ప్రతినిధులు దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. అలాగే నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్ శివాలయం, న్యూ నల్లకుంటలోని రామాలయం, పాత రామాలయంలో కూడా భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మహంకాళి దేవాలయం, గురువాయూర్ శ్రీకృష్ణ మందిరం(అయ్యప్ప టెంపుల్), డీడీ కాలనీలోని అహోబిలమఠం, నల్లకుంట శంకరమఠంలో భక్తులు దీపోత్సవం జరిపారు. కాచిగూడలోని వీరన్నగుట్టలో దీపారాధన చేశారు. తులసిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి అక్కడ కూడా దీపాలు పెట్టారు.

లంగర్‌హౌస్ సంగం రామమందిరంలో..

లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద సంగం రామాలయంలో జరిగిన పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెల్లవారు జామున మఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో సీతా రాముల ఉత్సవ విగ్రహాలను రథంలో ఊరేగించి పూజలను ప్రారంభించారు. కార్తిక పౌర్ణమి(డిప్కి పున్నం)ను పురస్కరించుకొని సంగం రామాలయం వద్ద నిర్వహించే జాతరకు నగరం నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. అంతే కాకుండా సంగం ఆలయం పక్కన ఉన్న హుడా పార్కులో వన భోజనాలను చేశారు. సంగం నది వద్ద మహిళలు దీపాలను వెలిగించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతులు

విజయ్‌నగర్ కాలనీ డివిజన్ పరిధిలోని దేవునికుంట వేంకటేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో ఆలయ ఈవో శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదే విధంగా రాంకోఠిలోని సీతారామాంజనేయ స్వామి మందిరంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజలు శ్రీ రాఘవ శర్మ, ఆలయ ట్రస్టీ ఆకుల సత్యనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు.

దేవునికుంట వేంకటేశ్వర స్వామి మందిరంలో వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

గోల్నాక మహాశివాలయంలో భక్తుల రద్దీ

గౌలిగూడలోని జంగల్ విఠోబా దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు. పండితులు దంపతులతో కలిసి వ్రతాలలో పాల్గొన్నారు.



లంగర్‌హౌస్ సమీపంలో గిర్కపల్లిలోని అన్నపూర్ణ దేవాలయంలో ప్రత్యేక పూజల్లో విజయ తెలంగాణ ఉత్సవాల సమితి చైర్మన్ జెన్నసుధాకర్, తదితరులు

మహంకాళి ఆలయంలో చండీ హోమంలో పాల్గొన్న ప్రతినిధులు



గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌ను సన్మానిస్తున్న జంగల్ విఠోబా దేవాలయ కమిటీ అధ్యక్షుడు వి.కిషన్ యాదవ్, బేగంబజార్ కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్

అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని వివిధ అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 21లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 26వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. బ్యాక్‌లాగ్ అభ్యర్థులకు ఇది చివరి అవకాశమని పేర్కొన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీబీఏ, బీఏ పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని బీబీఏ, బీఏ పరీక్ష తేదీలను మార్చినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ రిటెయిల్ ఆపరేషన్స్, బీబీఏ లాజిస్టిక్స్ మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఏ అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 19 నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదేరోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షలను ఈనెల 19 నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) (సీబీసీఎస్) మెయిన్, బ్యాక్‌లాగ్, సప్లిమెంటరీ, బీఈ (నాన్ సీబీసీఎస్) వన్‌టైం చాన్స్ పరీక్ష ఫలితాలతో పాటు డీపీఈడీ, బీపీఈడీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షల రివాల్యుయేషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

కాచిగూడ, నవంబర్ 15: నగరంలోని ప్రయాణికులకు మరిన్ని సేవలు అందించడానికి ఆర్టీసీ సంస్థ నడుం బిగించిందని కాచిగూడ డిపో మేనేజర్ టి.రఘు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాడమే లక్ష్యమన్నారు. ప్రయాణికులకు సమస్యలు తలెత్తినా, సందేహాలు, సలహాలు తెలియజేయాలన్నా 9959226130 నంబర్లకు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అప్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా నూనావత్ రవి నాయక్

సుల్తాన్‌బజార్, నవంబర్ 15: అప్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నూనావత్ రవి నాయక్ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఇటీవల నగర పోలీస్ కమిషనర్ చేపట్టిన బదిలీల్లో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లింగేశ్వర్‌రావు బదిలీపై వెళ్లడంతో రవి నాయక్ బాధ్యతలను చేపట్టారు. ఈ సంధర్భంగా ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది, మైత్రి పీస్ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

తెలంగాణ ఉద్యమంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

సుల్తాన్‌బజార్, నవంబర్ 15: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ మేరకు తెలంగాణ గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ నేతృత్వంలో ముఖ్య గ్రంథ పాలకురాలు పీజీవీ రాణి ఆధ్వర్యంలో అప్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో తెలంగాణ ఉద్యమం అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు వేడుకల్లో బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేయడం జరుగుతుందని పీజీవీ రాణి తెలిపారు.

విద్యార్థులు సరైన మార్గంలో పయనించాలి

కాచిగూడ, నవంబర్ 15: విద్యార్థులు సరైన మార్గంలో పయనిస్తే దేశ కీర్తి పెరుగుతుందని బచ్‌పన్ బచావో ఆందోళన్ కో-అర్డినేటర్ వెంకటేశ్వర్లు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు నింబోలిఅడ్డా ప్రభుత్వ బాలికల సదానం సూపరింటెండెంట్ ఎన్.మైథిలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ.. బాలికలకు అవకాశమిస్తే సాధించలేనిది ఏది లేదన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, పిల్లలకు చిన్ననాటి నుంచే సహనం, ఓపిక, మంచి లక్షణాలను నేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అస్రీత ప్రోగ్రామ్ డైరెక్టర్ వి.పర్వతాలు, సీడబ్లూసీ చైర్‌పర్సన్ టీఎల్ఎం రెడ్డి,రాజారెడ్డి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

అర్థశాస్త్రంలో డాక్టరేట్ సాధించిన కరుణశ్రీ

సుల్తాన్‌బజార్, నవంబర్ 15: తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం.కరుణశ్రీ అర్థశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ జె.నర్సింగరావు పర్యవేక్షణలో భారత దేశంలో వ్యవసాయ ఉత్పాదక-తెలంగాణ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టాను అందుకున్న సందర్భంగా ప్రొఫెసర్‌లు సుధాకర్‌రెడ్డి, రాములు, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ మాధురి అభినంధించారు.

గోల్నాక క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఆపత్కాలంలో ఆర్థిక చేయూత

- ఒక్కరోజే 26 మందికి రూ.9లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ
- పేదలు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, నవంబర్ 15: పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక చేయూత అందిస్తుంని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొత్తం 26 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ నుంచి మంజూరైన రూ.9,10లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురై దవాఖానల్లో చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన దాదాపు ఐదున్నరేండ్ల కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కొట్లాది రూపాయలు బాధితులకు అందజేశామని తెలిపారు. తమ కార్యాలయం సిబ్బంది సీఎం కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ వీలైనంత త్వరగా బాధితులకు చెక్కులు అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి ఆహ్వానం

అంబర్‌పేట, నవంబర్ 15: అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని సేవా సమితి ప్రతినిధులు ఆహ్వానించారు. బొడ్రాయి పునర్నిర్మాణ కమిటీ కన్వీనర్ సి.శ్రీనివాస్‌ముదిరాజ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం కేంద్ర మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

సమగ్ర కులగణన సర్వేలో రాజకీయ పార్టీలు పాల్గొనాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అభినందిస్తున్న ఓబీసీ సెంట్రల్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, తదితరులు

కాచిగూడ, నవంబర్ 15: బీసీ సంఘాల పోరాటాల ఫలితమే ప్రభుత్వం దిగివచ్చి కులగణకు శ్రీకారం చుట్టిందని జాతీయ ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం కాచిగూడలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కులగణకు చేస్తున్నందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుక్రవారం సచివాలయంలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా సమగ్ర కులగణన సర్వే జరుగుతున్న సందర్భంగా రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్యుమరేటర్లకు సహకరించండి

అబిడ్స్, నవంబర్ 15: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని మేరు సంఘం నాయకులు కీర్తి రాజ్‌గోపాల్ కోరారు. సర్వే కోసం తన ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్‌కు ఫారాన్ని నింపి ఇచ్చారు. ఈ సందర్భంగా కీర్తి రాజ్‌గోపాల్ మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చిన సమయంలో మేరు కులస్తులు తప్పనిసరిగా ఎన్యుమరేటర్‌కు వివరాలు తెలిపి నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వేలో 56 ప్రధాన ప్రశ్నలతో పాటు అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

సెల్‌ఫోన్ దొంగల రిమాండ్

కాచిగూడ, నవంబర్ 15: రద్దీగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ డివిజన్ ఏసీపీ వి.రఘు, ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ వివరాలను వెల్లడించారు. తుర్కాంజల్, ఇంజాపూర్ ప్రాంతానికి చెందిన రాందాస్ కుమారుడు శెట్టి రాకేశ్(23), అదే ప్రాంతానికి చెందిన 15 ఏండ్ల మైనర్ బాలుడు. వీరిద్దరు జులాయిగా తిరుగుతూ రాత్రి సమయాల్లో రద్దీగా ఉండే పలు ప్రాంతాలు, బస్‌స్టాండ్‌లలో సెల్‌ఫోన్‌లను దొంగలిస్తూ, దొంగిలించిన సెల్‌ఫోన్‌లను అమ్ముకుంటూ మద్యం సేవిస్తూ జల్సాలు చేస్తుంటారని తెలిపారు. ఇదే క్రమంలో ఈనెల 6వ తేదీ రాత్రి జామై ఉస్మానియా ప్రాంతానికి చెందిన మీనా(48), శీతల్‌తో కలిసి ఉప్పుగూడలోని శుభకార్యానికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గమధ్య కాచిగూడ పాత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో రాకేశ్, మైనర్ బాలుడు మీనా బ్యాగులోంచి సెల్‌ఫోన్, బంగారు ఆభరణాలు, రూ.500నగదు తీసుకొని పారిపోయారు. మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై పి.రవి కుమార్ ఆధ్వర్యంలో ఇంజాపూర్ సమీపంలో అనుమానస్పాదంగా తిరుగుతున్న రాకేశ్, మైనర్ బాలుడున్ని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనం ఒప్పుకున్నారు. వారినుంచి 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని శుక్రవారం రాకేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి, మైనర్ బాలున్ని చైల్డ్ హోంకు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైం సిబ్బంది శివ, అశోక్, శ్రీకాంత్, అర్జున్ పాల్గొన్నారు.

పేదల ఇండ్లు కూల్చడమే ప్రజాపాలనా..?

మాట్లాడుతున్న రాణి రుద్రమదేవి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, తదితరులు

కాచిగూడ, నవంబర్ 15: కాంగ్రెస్ ప్రజాపాలన అంటే పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లు కులగొట్టడమా అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి ప్రశ్నించారు. శుక్రవారం బర్కత్‌పుర నగర కార్యాలయంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావుతో కలిసి మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు గోల్నాక డివిజన్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, చింతల రాంచంద్రరెడ్డి, మాజీ మంత్రి కృష్ణ యాదవ్ తదితరులు బస చేస్తారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రజాపాలన చేస్తున్నామని గొప్పలు చేబుతున్నారని, ప్రభుత్వం చేసే పనులకు ఏ మాత్రం పొంతనలేదని ఆరోపించారు. మూసీ పరీవాహన ప్రాంతాల్లో కొన్నేండ్లుగా జీవనం గడుపుతున్నారని, అక్కడ నివసిస్తున్నా పేదలకు సమాచారం లేకుండా విచాక్షణ రహిత్యంగా అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, కేశబోయిన శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.